# ఫిర్యాదుదారులకు భరోసా కలిగేలా విధులు ఉండాలి

## సింగరాయకొండ, టంగుటూరు పోలీస్ స్టేషన్, సింగరాయకొండ సర్కిల్ ఆఫీస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 19)**

సింగరాయకొండ, టంగుటూరు పోలీస్ స్టేషన్‌లను, సింగరాయకొండ సర్కిల్ ఆఫీస్ ను జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్లోని నిర్వహించే పలు రికార్డులు పరిశీలన నమోదైన కేసులపై ఆరా తీశారు. ట్రాఫిక్ నివారణ,రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేర నియంత్రణ, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధతో వచ్చే ఫిర్యాదుదారులకు భరోసా కలిగేలా విధులు ఉండాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలన్నారు.

పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని,గదులను, రిసెప్షన్ కౌంటర్, మహిళా సహాయక కేంద్రం ,స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, పలు రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి తక్షణమే పిర్యాదు దారులకు పరిష్కారం అందించాలన్నారు. స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు,వారి నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని, చెడునడత కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎక్కువ సమయం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. సింగరాయకొండలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, గంజాయి మరియు మాదకద్రవ్యాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మహిళలు/పిల్లలపై జరిగే అకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. సింగరాయకొండ పియస్ ఆవరణలో ఎస్పీ మొక్కను నాటి సిబ్బంది అందరూ పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం శ్రీ వరాహలక్ష్మి నరసింహస్వామి దేవస్థానాన్ని సందర్శించి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, సింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, సింగరాయకొండ ఎస్ఐ మహేంద్ర, టంగుటూరు ఎస్ఐ నాగేమల్లేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.





# ఉపిరితిత్తుల పనితీరు పరీక్షల పరికరం

### జిజిహెచ్‌లో ఏర్పాటు శుభపరిణామం

### జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ మాణిక్యరావు, జిఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 19)**

ఊపిరితిత్తుల పని తీరును అంచనా వేసి పలు చికిత్సలకు తోడ్పడే ఉపిరితిత్తుల పనితీరు పరీక్షలు పరికరాన్ని జిజిహెచ్‌లో ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామం అని , ఒక్క పలమానాలజీ విభాగంలోనే కాకుండా అన్ని విభాగాల వైద్యులకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది అని జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ మాణిక్య రావు, జిఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు 50 లక్షల రూపాయలతో పల్మనాలజీ , జనరల్ మెడిసిన్ విభాగాల్లో ఏర్పాటు చేసి మూడు ఉపిరితిత్తుల పనితీరు పరీక్షలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పరీక్షలలో గాలిలో ఉన్న ఆక్సిజన్‌ను రక్తంలోకి మీ ఊపిరితిత్తులు ఎంత స్థాయిలో గ్రహిస్తున్నాయో కూడా పరీక్షిస్తాయి. అలాగే, వ్యాయామం మీ పిరితిత్తులపై ఎలా ప్రభావం చూపుతుందో తెలుసుకోవడానికీ ఉపయోగపడతాయి అని మొత్తంగా ఊపిరితిత్తుల మార్గాల్లో తడిమిపోయిన భాగాలను గుర్తించడం ఆక్సిజన్‌ను రక్తంలోకి అందించే సామర్థ్యంలో మార్పులను గుర్తించడం పొగతాగే అలవాటుతో ఊపిరితిత్తుల మీద ఎలాంటి ప్రభావం పడిందో అంచనా వేయడం శ్వాస సంబంధిత మందులు ఉపయోగకరంగా ఉన్నాయా అనే విషయాన్ని తెలుసుకోవడం పర్యావరణ రసాయనాల వల్ల ఊపిరితిత్తులు ప్రభావితమయ్యాయా అనే దాని గుర్తింపు శస్త్రచికిత్స లేదా ఇతర వైద్య ప్రక్రియలు భరించగల సామర్థ్యం ఉందా అనే అంచనా వేయడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి పరికరం జి జి హెచ్ అందుబాటులోకి రావడం ఎంతో శుభపరిణామం అని ఈ పరికరం రావడం లో సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే వారికి, డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వారికీ ధన్వదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె అద్దయ్య, డిప్యూటీ సూపరెంటెండెంట్స్ డాక్టర్ తిరుపతిరెడ్డి, డా ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ డా సుధాకర్, సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ మాధవి లత, గెనెల్ పల్మనాలజీ హెడ్ అఫ్ ద డిపార్ట్మెంట్ డాక్టర్ రామ స్వామి, జనరల్ మెడిసిన్ హెడ్ అఫ్ ద డిపార్ట్మెంట్ డాక్టర్ పద్మలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కుమారవర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రంజిత్ బాషా, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్‌లో కలిగే లోపాలను సరిచేయాలి

### దస్తావేజు లేఖరలు పెన్ డౌన్ నిరసన

### దస్తా వేజు లేఖరుల సంఘం జిల్లా అధ్యక్షులు మోపర్తి హరిబాబు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 19)**

రిజిస్ట్రేషన్‌లో కలిగే లోపాలను సరిచేయాలని దస్తావేజు లేఖరలు పెన్ డౌన్ నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో తీసుకువచ్చిన మార్పులను స్వాగతిస్తూ అందులో ఉన్న లోపాలను సరిచేయాలని దస్తా వేజు లేఖరుల సంఘం జిల్లా అధ్యక్షులు మోపర్తి హరిబాబు అన్నారు. నగరంలోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం వద్ద దస్తా వేజు లేఖరుల సంఘం ఆధ్వర్యంలో పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో తీసుకొచ్చిన 2.0 వర్షన్ లో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని దాని గుండా రిజిస్ట్రేషన్లు వాయిదాల పడుతున్నాయని అన్నారు. ఎడిట్ ఆప్షన్ ను తెలంగాణ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆప్షన్ ఇవ్వనందు వలన ఈ సమస్యలు తలెత్తుతున్నాయని వెంటనే ఎడిట్ ఆప్షన్ ని తీసుకురావాలని ఎన్నారైలు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని, రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ కార్డు ఓ.టీ.పీ.ల వలన ఇబ్బంది పడుతున్నారని వారు అన్నారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు 19,20, రెండు రోజులపాటు జరిగే షాపులు మూసివేసి నిరసన తెలిపారు.

పెన్ డౌన్ కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. రిజిస్టార్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ పి. నరసింహారావు, మువ్వకుంట్ల నాగేశ్వరరావు, మార్టూరి సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, గోపిశెట్టి శ్రీను, వీర బ్రహ్మచారి, సురేష్, దస్తాలేఖరులు పాల్గొన్నారు.

# జలమయమైన ఒంగోలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 19)**

ఒంగోలులో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమయ్యింది. ఏ వీధి చూసినా వర్షపు నీటితో నిండిపోయాయి. నడవాలంటే కష్టపడాల్సిందే... బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి నగరంలోని భాగ్యనగర్, రాం నగర్, డి మార్ట్ ఎదురు, బస్టాండ్ సెంటర్, అద్దంకి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీటితో కాలువలు పొంగిపొర్లాయి. రోడ్డు పై మోకాళ్ళ లోతున వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భాగ్యనగర్‌లో అయితే వర్షపు నీరు ఇండ్లలోకి చేరింది. దీంతో ఆ ప్రాంత ప్రజానీకం అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి దాపురించింది. మొత్తంగా వర్షం కురిసిందంటే ఒంగోలు జలమయం కావడం ఖాయం....













# లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కల్గించే వారి పై కఠినంగా వ్యవహరించాలి

## పోలీస్ స్టేషన్‌ల తనిఖీ సందర్భంగా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 19)

లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కల్గించే వారి పై కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు అన్నారు. శుక్రవారం ఒంగోలు ఒన్ టౌన్, రూరల్, తాలుకా పోలీస్ స్టేషన్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పోలీస్ స్టేషన్ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించారు. చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌లోనే మహిళా సహాయక కేంద్రం, రిసెప్షన్, లాక్ అప్ రూమ్స్ పరిశీలించారు. స్టేషన్ బయట నిలబడిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి పోలీసుల పని తీరును అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు వస్తే వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవహరిస్తే పోలీసుల పట్ల ప్రజలలో గౌరవం పెరుగుతుందన్నారు. పోలీస్ స్టేషన్లో సీజ్ చేయబడిన వాహనాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు అనుమతితో వాహనాలను డిస్పోసల్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. పోలీసు స్టేషన్ యొక్క క్రైమ్ మ్యాప్‌లను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డ్స్ పరిశీలించారు. పోలీసు స్టేషన్‌లో కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాత కేసుల పై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి కేసులను త్వరితగతిన ఛేధించాలని ఆదేశించారు. ఒంగోలు మార్కెట్ ఏరియాలో డ్రోను, సీసీ కెమెరాల నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ప్రాంతాలను గుర్తించి నిరంతరం డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, అల్లర్లు చేసిన అలాంటి వారిని ఉపేక్షించవద్దన్నారు. లా అండ్ ఆర్డర్ కు విఘాతం కల్గించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, తాలూకా ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఒంగోలు రూరల్ సిఐ ఎన్ శ్రీకాంత్ బాబు, సిబ్బంది ఉన్నారు.










# మాదిగ వైద్య విద్యార్థినికి రూ.30 వేలు

**ఆత్మీయ సాయం చేసిన దళిత నేత నీలం**

**ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండబట్టే సమీక్షకు ఫ్రీ సీటు**

**మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యానికి అప్పగించటాన్ని దళిత బహుజనులు వ్యతిరేకించాలి**

**దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 19)

నిరుపేద మాదిగ వైద్య విద్యార్థిని కొమ్ము సమీక్షకు దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు 30 వేల రూపాయల ఆత్మీయ సాయం చేశారు. శుక్రవారం ఒంగోలులోని నాగేంద్ర కార్యాలయంలో కొమ్ము సమీక్ష అభినందన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడలోని రంగరాయ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందిన సమీక్షను నీలం నాగేంద్ర అభినందించారు. ఈ క్రమంలో నాగేంద్ర మాట్లాడుతూ



అంబేద్కర్ స్ఫూర్తితో పేద కుటుంబం నుంచి సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలో జూనియర్ కళాశాలలో చదువుకొని వైద్య విద్యార్థినిగా అవకాశం దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పేద దళిత బిడ్డలు ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు తన వంతు బాధ్యతను నిర్వర్తించటం సంతృప్తిగా ఉందన్నారు. ప్రభుత్వ కళాశాల ఉండబట్టి, సమీక్ష చదువుకోవటం వల్ల తనకు కన్వీనర్ కోటాలో ప్రభుత్వ కళాశాలలో ఫ్రీ సీటు వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు భాగస్వామ్యానికి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యానికి మెడికల్ కాలేజీలు అప్పగించడం వల్ల, కన్వీనర్ కోట సీట్లు తగ్గి, మేనేజ్మెంట్ కోటా సీట్లు పెరుగుతాయన్నారు. మేనేజ్మెంట్ కోటా సీట్లలో రిజర్వేషన్లు ఉండవనే విషయాన్ని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలు గుర్తించాలన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు భాగస్వామ్యానికి అప్పగిస్తే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కుటుంబాల నుంచి సమీక్ష వంటి తెలివైన విద్యార్థులకు మెడికల్ సీట్లు వచ్చే పరిస్థితి ఉండదనే విషయాన్ని గుర్తించాలన్నారు. మేనేజ్మెంట్ కోటాలో కోట్లు గుమ్మరించి ఎంబిబిఎస్ అడ్మిషన్ పొందే పరిస్థితి 99 శాతం దళిత బహుజనులకు లేదన్నారు. ప్రభుత్వ కళాశాలలు ఉంటే కూలి కొడుకు కలెక్టర్, మేస్త్రి కొడుకు మేజిస్ట్రేట్ కావచ్చన్నారు. ప్రైవేటు భాగస్వామ్యపు కళాశాలలు వస్తే ధనిక వర్గాల సంతతే డాక్టర్లు ఇంజనీర్లు సైంటిస్టులు జడ్జీలు అవుతారన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రైవేటు భాగస్వామ్యపు విధానాలపై దళిత బహుజనలు పోరాడాలన్నారు. సమావేశంలో కొమ్ము సమీక్ష తల్లిదండ్రులతో పాటు మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, కాకుమాను రవి, పత్రా బంగారం తదితరులు పాల్గొన్నారు. సమీక్ష కుటుంబ సభ్యులు నాగేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 19)

స్వచ్ఛత హీ సేవా 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఒంగోలు నగరపాలక సంస్థ ప్రాంగణంలో నగరపాలక సంస్థలో పనిచేయుచున్న 916 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. ఈ వైద్య శిబిరం స్థానికంగా ఉన్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్, ఇయస్ఐ కార్పోరేషన్ వారి సహకారంతో ఏర్పాటు చేసారు. వైద్య శిబిరం మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇయస్ఐ కార్పొరేషన్ ఒంగోలు బ్రాంచి మేనేజర్ సత్య ప్రకాష్, ఇయస్ఐ ద్వారా కార్మికులకు వచ్చు ప్రయోజనాలు గురించి వివరించుట జరిగింది. ఈ వైద్య శిబిరంలో ఆర్థో, చెస్ట్, డెర్మటాలజి, సాధారణ వ్యాధులకు సంబంధించిన నలుగురు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డాక్టర్లు కార్మికులను పరీక్షించి సంబంధిత మందులు పంపిణీ చేసారు. నగరపాలక సంస్థ కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమీషనరు పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై అశ్రద్ధ వహించకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తాగుడు వంటి వ్యసనాలకు లోనుకాకుండా వారి కుటుంబాలను తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి) , కార్పొరేటర్లు, నగరపాలక సిబ్బంది, మున్సిపల్ ఇంజనీరు, సహాయ కమీషనరు, మునిసిపల్ హెల్త్ ఆఫీసరు, శానిటరీ సూపర్ వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు, హెల్త్ సెక్రెటరీలు పాల్గొన్నారు.



